క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి


నివాళులర్పిస్తున్న ఆరె సంక్షేమ సంఘం నాయకులు

దహెగాం: మండల కేంద్రానికి చెందిన బాలిక పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి వద్ద గత నాలుగు రోజుల క్రితం మానవ మృగం చేతిలో అత్యాచారం, హత్యకు గురికాగా ఆదివారం ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శెట్‌పల్లి శివాజీ బాలిక చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు 5 ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్లే వెంకన్న, రాష్ట్ర నాయకుడు, జిల్లా అధ్యక్షుడు జయరాం, తాలుకా అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకన్న, నాయకులు నారాయణ, డుబ్బుల నానయ్య, లోనారే రవీందర్, తిరుపతి, బిక్కాజీ తదితరులు పాల్గొన్నారు.

'గౌరవ వేతనాలు చెల్లించాలి'

తిర్యాణి: మండల పరిషత్ సభ్యులు(ఎంపీటీసీ) పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలని గడలపెల్లి ఎంపీటీసీ సార రమేశ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ఆరు నెలలుగా ప్రభుత్వం ఎంపీటీసీలకు సంబంధించిన గౌరవ వేతనాలు ఇవ్వడం లేదన్నారు. గ్రామాభివృద్ధిలో ఎంపీటీసీ పాత్ర ఎంతో కీలకమైందని, ప్రభుత్వం ఎంపీటీసీలపై సవతి తల్లి ప్రేమ చూపించడం సరికాదన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి


రామారావు(ఫైల్)

కెరమెరి: మండలంలోని సాకడ(బి) గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పర్చకి రామారావు(57) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. గడిచిన నెలరోజులుగా ఆయన అనా రోగ్యంతో బాధపడుతున్నారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఉందని అనేక ఆస్పత్రుల్లో వైద్యం చేయించినప్పటికీ వ్యాధి నయం కాలేదు. ఆయన మండలంలోని కొలాంగురి గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఏళ్లుగా ఆయన టీపీటీఎఫ్‌లో ప్రధాన బాధ్యతలు నిర్వర్తించారు. మృతుడికి భార్య సురేఖ, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

నివాళి..

ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పోరా టం చేసే నాయకుడు పర్చకి రామారావు మృతి కలిచి వేసిందని, టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆత్రం భుజంగ్‌రావు, రాష్ట్ర కార్యదర్శి కుమురం భీమ్ అన్నారు. నాయకులు కనక వెంకటేశ్వర్, మడపచి అర్జున్, నైతం నారాయణ, చహకటి శ్యాంరావు, న్యానేశ్వర్, విశ్వనాథ్ నివాళులర్పించారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

బెజ్జూర్(సిర్పూర్): పశువులను అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని పట్టుకున్నామని ఎస్సై విక్రమ్ తెలిపారు. మహారాష్ట్రలోని విట్టలవాడ నుంచి 36 పశువులను హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే సమాచారంతో బెజ్జూర్ మండలం కుంటలమానెపల్లి గ్రామ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. ఒక ఆవు వాహనంలో మృతి చెందగా.. మిగిలిన వాటిని కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించామని పేర్కొన్నారు.

నాలా నిలిచేనా..?



వాంకిడి: మండలంలోని నాలుగు వరుసల జాతీయ రహదారి -363కి ఇరువైపులా సర్వీస్ రోడ్డుకు ఆనుకొని నిర్మించిన సైడ్ డ్రెయిన్ నాలాలు ఏడాది గడవకముందే శిథిలావస్థకు చేరుకున్నాయి. అడ్డగోలుగా సైడ్ డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టడంతో పలు చోట్ల నాలాలపై నిర్మించిన స్లాబులు పగుళ్లు తేలుతున్నాయి. పోలీస్ క్వార్టర్స్‌కు ముందు నిర్మించిన నాలా కింది మట్టి కొట్టుకుపోయి ఒక వైపుకు వంగింది. ఈ వర్షాకాలంలో నాలా కింది మట్టి పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కుళాయిలున్నా చేతి పంపే దిక్కు

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీఅనుకోడ గ్రామ పంచాయతీలోని పాల్వాయినగర్ ప్రాథమిక పాఠశాలలో నీటి కుళాయిలు ఉన్నా నీటి సరఫరా కావడం లేదు. దీంతో విద్యార్థులు చేతి పంపునే వినియోగిస్తున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు చేతిపంపు వద్ద ఇబ్బందులు తప్పడం లేదు. కుళాయిలను వినియోగంలోకి తీసుకొస్తే విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సైతం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.


చేతిపంపు వద్ద విద్యార్థులు


నిరుపయోగంగా నీటి కుళాయిలు

ధ్వంసమైన రోడ్లు.. వాహనదారుల ఇక్కట్లు


రవీంద్రనగర్ సమీపంలో కోతకు గురైన రోడ్డు


పాల్వాయినగర్ వంతెన వద్ద ధ్వంసమైన రహదారి

చింతలమానెపల్లి మండలంలో ఇటీవల నిర్మించిన రహదారులు కాలపరిమితి ముగియక ముందే ధ్వంసమవుతున్నాయి. మండలంలోని కౌటాల నుంచి రవీంద్రనగర్ మీదుగా చింతలమానెపల్లి వరకు ఏడాది క్రితం రోడ్డు నిర్మించారు. నాసిరకంగా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో రహదారి ముక్కలవుతోంది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడడంతో పాటు రహదారి పలుచోట్ల కోతకు గురవుతోంది. అధ్వానంగా ఉన్న రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. - చింతలమానెపల్లి

రైతు చూపు.. 'పత్తి' వైపు!

జిల్లాలో ఒకప్పుడు రైతులు వరి, గోధుమ, మొక్కజొన్న, జొన్న, ఆహార ధాన్యాలైన కంది, పెసర, మినుము, శనగ, చిక్కుడు పంటలను అధిక సంఖ్యలో సాగు చేసేవారు. తర్వాత నూనె ధాన్యాలైన నువ్వులు, పత్తి, పొద్దుతిరుగుడు, కూరగాయలు ఇతర పంటలు సాగయ్యేవి. కానీ ప్రస్తుతం వాణిజ్య పంట పత్తిని రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీంతో పంటలు పండించే రైతులు సైతం ఆహార ధాన్యాలను కొనుక్కోవాల్సిన దీన పరిస్థితి ఏర్పడింది.


పత్తి విత్తనాలు వేస్తున్న వ్యవసాయ కూలీలు

వానాకాలం సాగు ప్రణాళిక

పంట	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
పత్తి	3,40,000
వరి	62,209
కంది	38,239
సోయాబీన్	6,089
పెసర	1700
జొన్నలు	680
మొక్కజొన్న	742
మినుము	163
వేరుశనగ	178
మొత్తం	4.50 లక్షలు

- వాణిజ్య పంటలపైనే రైతుల దృష్టి
- పప్పులు కొనాల్సిన దుస్థితిలో రైతులు
- జిల్లాలో ఈసారి 3.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- పత్తి విత్తనాలు వేసిన రైతులు

కౌటాల: ప్రభుత్వాలు పత్తి పంట సాగు తగ్గించి ఆహార ధాన్యాల సాగు వైపు మొగ్గు చూపాలని ఏటా సూచిస్తున్నా జిల్లా రైతులు మాత్రం పత్తి పంట సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. వాణిజ్య పంటలో లాభాలు అధికంగా వస్తాయనే ఆలోచనతో రైతులు ఆహారధాన్యాల పంటలను సాగు చేయడం లేదు. దీంతో అటు పశుగ్రాసం లేక పశువులు, ఇటు ఆహార ధాన్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో వానాకాలం పంటల సాగు ప్రణాళిలను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు.

ఏటా పత్తే..

జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో రైతులు పత్తి పంటను 3.40 లక్షల ఎకరాల్లో సాగుచేశారు. గతేడాది పత్తికి మద్దతు ధర బాగా పలకడంతో ఈ ఏడాది కూడా 3.40 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 80 శాతం మందికి పైగా రైతులు పత్తి విత్తనాలు వేశారు. ప్రభుత్వం పంటలు మార్పిడి చేయాలని ఏటా సూచిస్తున్నా పత్తి పంటపై రైతులకు ఆసక్తి ఏమాత్రం తగ్గలేదని తెలుస్తోంది. జిల్లాలో గత 12 ఏళ్ల క్రితం పత్తి పంటపై ఆసక్తి చూపని రైతులు ప్రస్తుతం పత్తి పంటనే ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. కంది ఒకప్పుడు వేల ఎకరాల్లో సాగయితే ఇప్పుడు వందల ఎకరాలకు పడిపోయింది. ఇతర ఆహార ధాన్యాల పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది.

ఆహార ధాన్యాల సాగేది?

ఒకప్పుడు పప్పుదినుసులు పొలాల్లో పండించే రైతులు ప్రస్తుతం దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి దుస్థితి నెలకొంది. సేంద్రియ ఎరువుల వాడకం తగ్గి రసాయనిక ఎరువుల వాడకం పెరిగింది. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. రసాయనిక ఎరువులతో పండించిన పంటలతో మానవాళితో పాటు పంటలకు కీడు చేసే కీటకాలు ఎక్కువగా పెరిగి, భూసారం తగ్గిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడూ ఒకే రకమైన పంట సాగు కాకుండా పంట మార్పిడి పద్ధతి పాటిస్తే భూసారం దెబ్బతినకుండా ఆహార ధాన్యాల కొరత తీరుతుంది. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడితే పర్యావరణాన్ని కాపాడవచ్చు.

గ్రాసం కొరత

ఒకప్పుడు రైతుల ఇళ్లలో గుమ్ముల నిండా ఆహార ధాన్యం, కొట్టం నిండా పశుసంపద కనిపించేది. ఇప్పుడు ఆ పరిస్థితి చాలా వరకూ తగ్గింది. వాణిజ్య పంటల సాగే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ఇటీవల మారుతున్న కాలంలో రైతులు ఎక్కువగా పత్తి, సోయా, పొద్దు తిరుగుడు వంటి వాణిజ్య పంటలను సాగు చేస్తుండడంతో ఆహార పంటల సంఖ్య తగ్గిపోయింది. దీంతో గ్రామాల్లో పశుగ్రాసం దొరక్కపోవడంతో మూగజీవాలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ మధ్యకాలంలో జిల్లా వ్యాప్తంగా పత్తి పంటను విపరీతంగా సాగు చేస్తున్నారు. పశువులు రోజూ గడ్డి మేయడానికి స్థలం కూడా లేకుండా దుక్కులు దున్నుతున్నారు. దీంతో పశువులకు గ్రాసం కరువైంది. మూగజీవాలను పోషించలేక కబేళాలకు తరలిస్తున్నారు. సాగు విషయంలో వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

భారీ వర్షం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత పది రోజులుగా రైతులు యాసంగి సీజన్‌లో పత్తి సాగు చేయడానికి పంట చేలో విత్తనాలు వేశారు. వర్షాలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్న సమయంలో భారీ వర్షం కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌటాల: మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని రైతులు పొడి దుక్కుల్లోనే వారం క్రితం పత్తి విత్తనాలు వేయడంతో వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఆదివారం వర్షం కురవడంతో పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు సంబర పడుతున్నారు. వర్షం కురవడంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందారు. వర్షం కారణంగా మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి

వాంకిడి: మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఏఈ శ్రీకాంత్ తెలిపారు. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణిలో విద్యుత్ సంబంధిత దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం, సూచనల కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జైనూర్: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సజావుగా పరిష్కరించే విధంగా ప్రతీ సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సాయికిరణ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కౌటాల: కౌటాల విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏడీఈ రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కౌటాల, సిర్పూర్(టి), బెజ్జూర్ విద్యుత్ సెక్షన్ కార్యాలయాల్లో నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి ఉంటుందన్నారు. కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్ మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సమస్యలుంటే సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

గిట్టుబాటు కాని ధర

- పత్తికి మద్దతుధర పెంచాలంటున్న రైతులు
- కనీసం రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్

కెరమెరి: ప్రస్తుతం పత్తి పంటకు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర ఎంతమాత్రం గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంటకు ఉన్న మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సీజన్‌లో పంట చేతికొచ్చే నాటికి క్వింటాల్ ధర రూ. 7,200 పలికే అవకాశం ఉన్నట్లు ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలోని మార్కెటింగ్ ఇంటలిజెన్స్ సంస్థ ప్రకటించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తన ప్యాకెట్లతో పాటు ఎరువులు, మందులు, కూలీల ధరలు అమాంతంగా పెరగడంతో ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించనున్న మద్దతు ధర ఏమాత్రం సరిపోదని రైతులు పేర్కొంటున్నారు.

26 వేల ఎకరాల్లో సాగు..

మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 8194 మంది రైతులు ఉండగా, 29,456 ఎకరాల్లో పంటల సాగు చేస్తున్నారు. అందులో 26,140 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. విత్తనాలు కొనుగోళ్లు మొదలుకొని పంట సేకరణ, మార్కెట్‌కు తరలించే ప్రక్రియ పూర్తయ్యే నాటికి ఒక్క ఎకరాకు సాగు పెట్టుబడిగా రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. గతేడాది ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.6900 ప్రకటించగా అనేక మంది ప్రైవేటు వ్యాపారుల వద్దే పత్తిని విక్రయించారు.

ఆశాజనకంగా ఉంటేనే..

పంట ఆశాజనకంగా ఉంటే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది. అయితే ఎక్కువ శాతం 6 నుంచి 8 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తుండడంతో మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ లెక్కన ఎకరం విస్తీర్ణంలో పత్తి పండించే రైతు కుటుంబం ఏడాది పాటు కష్టపడితే మిగిలేది ఏమీ ఉండడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మరో 20 నుంచి 30 శాతం ఖర్చులు పెరుగుతున్నాయి. గత సీజన్‌లో ప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.6900 మద్దతు ధర ప్రకటించింది. ప్రారంభంలోనే కేవలం వారం రోజుల పాటు ధర బాగున్నా క్రమంగా తగ్గుతూ వచ్చింది. అనేక మంది రైతులు తర్వాత ధర పెరుగుతుందని ఇళ్లలోనే పత్తిని నిల్వ చేసుకున్నారు. వారంతా తీవ్రంగా నష్టపోయారు.


అరక దున్నుతున్న రైతు

రూ.10వేలు ప్రకటించాలి



మార్కెట్‌లో పెరుగుతున్న ధరలతో కుటుంబపోషణ కష్టంగా మారుతోంది. వ్యవసాయంలో నానాటికీ పెరుగుతున్న విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలతో ఎంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదు. క్వింటాల్ పత్తికి రూ.10 వేలు ప్రకటించాలి.

– సెండే సకారాం, రైతు, బారేమోడి

బాధిత కుటుంబాలకు పరామర్శ

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రా మానికి చెందిన దాసరి జీవన్, అగర్‌గూడ గ్రా మానికి చెందిన ఎల్ములే బాపు ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు జాజిమొగ్గ శ్రీనివాస్, ఉపాసీ సంజీవ్, పాపయ్య, కాంగ్రెస్ నాయకులు సంతోష్‌గౌడ్, బండు, ఎస్‌కే బాబు, చలం, శశికుమార్ తదితరులు ఉన్నారు.


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

అమ్మవారి ఆలయంలో భక్తుల పూజలు


మహంకాళి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని పలు గ్రామాల నుంచి అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులతో ఆలయంలో సందడి నెలకొంది. సీజన్ ప్రారంభమైన వర్షాల జాడ లేకపోవటంతో భక్తులు వరుణ దేవుడికి పూజలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి నైవేద్యాలు, ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న శనేశ్వరుడు, కాళభైరవుడితో పాటు నాగదేవత, శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదానం ఏర్పాటు చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం

రెబ్బెన: మండలంలోని నంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008- 09 బ్యాచ్ పదో తరగతికి చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితులంతా కలుసుకుని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో చేసిన చిలిపి చేష్టలు, తీపి గుర్తులను పంచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి నంబాల మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా.. ఉపాధ్యాయులు సోమశేఖర్, రాజశేఖర్, రమణ, రాజన్న, సీఆర్పీ రాజేశ్, పూర్వ విద్యార్థులు రజిత, రాజేశ్వరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



కుమురంభీం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు శంకర్

జైనూర్: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కుమురంభీం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతంలో కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలుంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.